క్లుప్తంగా

జాన్సన్ దంపతులకు సత్కారం



మేడిది జాన్సన్, ప్రియాంక దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని మన్నా చర్చ్ వద్ద ఆదివారం రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్, ప్రియాంక దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘం, యూత్, స్త్రీల సమాజం, సండే స్కూల్ తరపున జాన్సన్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా చర్చ్ కాపరి బిషప్ ఎం.దేవదాసు మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మేడిది జాన్సన్ చేసిన సేవలను కొనియడారు. సంఘ పెద్దలు, యూత్, విశ్వాసులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



కాలువను తలపిస్తోన్న కాళ్ల పల్లపువీధి

కాళ్ల : అల్పపీడన ప్రభావంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షానికి రాష్ట్రీయ రహదారులు, అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. రహదారులు కాలువలను తలపించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో వీధులన్ని నీట మునిగాయి. ప్రధానంగా కాళ్ల గ్రామంలో పల్లపువీధిలో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడటంతో పంచాయతీ సిబ్బంది నీరు మళ్లించే ఏర్పాట్లు చేశారు. దొడ్డనపూడి, కాళ్లకూరు,తో పాటు బొండాడపేట, కలవపూడి, కోలనపల్లి తదితర గ్రామాల్లో రాష్ట్రీయ రహదారి, ఆర్అండ్‌బీ రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఆయా గ్రామాల్లో సర్పంచులు, అధికారులు వర్షపు నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ ఆసుపత్రికి వితరణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం దాతల సహకారంతో ఆరు మంచాలు, డిజిటల్ స్కానర్, కౌంటర్, ఇతర పరికరాలను అందజేశారు. ఇటీవల పట్టణంలో మృతి చెందిన డాక్టర్ వై. లక్ష్మణరావు జ్ఞాపకార్థం అతని కుమారుడు యర్రంశెట్టి కిరణ్‌కుమార్, లక్ష్మీసౌజన్య దంపతులు ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని తద్వారా మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో డాక్టర్ వై లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ గంటా ప్రభాకర్, ఆసుపత్రి కమిటీ మెంబర్లు చెన్ను విజయ్, చినిమిల్లి గణపతి, ఎరుబండి రామ్మూర్తి, మండెల కుమార్, ఆకుల సుబ్బారావు, కొల్లి కొండ ప్రసాద్, రావి కుమార్, జక్కంపూడి కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ చలో ఏలూరు

యలమంచిలి: పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించే దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తునట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల కో–కన్వీనర్ పసుపులేటి చినబాబు చెప్పారు. యలమంచిలి మండలం ఇలపకుర్రులో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. మాదిగ సోదరుల్లో చైతన్యం తెచ్చేందుకు సోమవారం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగే సమావేశానికి వస్తున్నట్లు ఈ సమావేశానికి మాదిగలంతా పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యార్లగడ్డ రత్నంరాజు, నాయకులు నామవరపు కృపానాథం, ఈతకోట మోసేను, ఎస్ శ్రీనివాస్, యార్లగడ్డ సాగర్, యార్లగడ్డ లోగేంద్రనాథ్, ముప్పిడి రవితేజ, మాదాసి రాఘవ, ముప్పిడి చిన్నిబాబు, ముమ్మిడివరపు ప్రవీణ్, మాలవరపు మహేష్, మాదాసు రవితేజ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: సమాజానికి సేవ చేయాలనే ఆలోచన కలగడం కూడా ఓ అదృష్టమని పట్టణ సీఐ డి రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు లో ఏఐఎస్ అకాడమీ చికాగో యునైటెడ్ స్టేట్స్ వారి సౌజన్యంతో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా విచ్చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో గుండె, కిడ్నీ, న్యూరాలజీ, మూత్రకోశ వ్యాధులకు చెందిన వైద్యులు 437 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శనగన కృష్ణమూర్తి, సెక్రటరీ షేక్ ఫీర్‌సాహెబ్, పోతుల ఉమా శంకరరావు, మానెం బసవరాజు, జవ్వాజి కల్యాణ్, ఆదుర్తి రాధాకృష్ణ, కిమ్స్ బొల్లినేని వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



విశేష అలంకరణలో మారెమ్మ తల్లి



శ్రీమావుళ్లమ్మ తల్లికి బంగారం సమర్పిస్తున్న దృశ్యం



వెలివర్రులో ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

పాలకోడేరు : పాలకోడేరు గ్రామంలో గరువు వద్ద వేంచేసియున్న శ్రీ మారెమ్మ అమ్మవారి 49 వ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటా అమ్మవారికి ప్రత్యేక పొన్పులు చలివిడి పానకాలు, సారే చీరలు కావిళ్ల సమర్పించి భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు తీర్చుకున్నారు. గరగనృత్యాలు, ఆసాదుల విన్యాసాలు, శక్తి వేషాలు, కేరళ వాయిద్యాలు, కాంతారా వేషధారణలు మంగళ వాయిద్యాల నడుమ ఎంతో కనుల పండుగగా శ్రీ మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవం జరిగింది.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన అడబాల రాంబాబు 8 గ్రాముల బంగారాన్ని సమర్పించారు. వీరికి ఆలయ అధికారులు రసీదు, అమ్మవారి ప్రసాదాన్ని అందచేశారు.

22 నుంచి పేరంటాలమ్మ ఉత్సవాలు

ఉండి : మండలంలోని వెలివర్రులో వీరపేరంటాలమ్మ అమ్మవారి 70వ వార్షిక మహోత్సవాలను ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో జాతర ఉత్సవాల పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ప్రతినిధులు విడుదల చేశారు. చైర్మన్ రంగరాజు మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకుని అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ఏలూరు తదితర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఉత్సవాలకు తరలివస్తారన్నారు. కార్యక్రమంలో కళ్ళేపల్లి సతీష్‌రాజు, ముదునూరి కొండరాజు, ముదునూరి వీర్రాజు, రుద్రరాజు నాగసంజీవరాజు, ఆలయ మేనేజర్ రుద్రరాజు ఫణిరామకిశోర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలంతా అండగా నిలవాలి



శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుని కలిసిన వైఎస్సార్ సీపీ వీరవాసరం ఎస్సీ సెల్ నాయకులు

వీరవాసరం : శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుని వైఎస్సార్ సీపీ వీరవాసరం ఎస్సీ సెల్ విభాగం మండల శాఖ నాయకులు ఆదివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎస్సీ ఎస్టీలంతా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, కాటం స్టాన్లీ రాజు, బొంతు రమేష్, చికెలే మంగతాయారు, చిక్కాల రాజు, గోడి షణ్ముఖరావు, సంద్రమళ్ల శ్యాంబాబు, పత్తుల సాల్మన్ రాజు, పత్తుల టైసన్, గడ్డం ముసలయ్య, వెంపళ్ల నరసింహమూర్తి, దేవ రాంబాబు, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

అక్షర కిరీటి తెన్నేటికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న తెన్నేటి మాస్టార్

పాలకోడేరు : పాలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో తెలుగు పండితులుగా పనిచేస్తున్న తెన్నేటి నర్సింహమూర్తికి బెంగుళూరుకు చెందిన కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య శ్రీ శోభకృత్ ఉగాది జాతీయ సాహిత్య పురస్కారం ప్రదానం చేసింది. బెంగుళూరు కళ్యాణ నగర్‌లోని ఇండో ఏషియన్ అకాడమీలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో ఈ అవార్డును ఇచ్చి సన్మానించారు. ఈయన రచించిన తేనెలూరు తెలుగు మనది అనే వ్యాస సంకలనానికి ఈ పురస్కారం అందించినట్లు సమాఖ్య చైర్మన్ భోగవరపు మాల్యాద్రి, అధ్యక్షుడు జి.చండీశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత తెన్నేటి మాట్లాడుతూ వివిధ సంస్థల వారు ప్రతిపాదించిన రచనల ద్వారా ఆయా కవులను రచయితలను గుర్తించి జాతీయ స్థాయిలో ఉగాది పురస్కారాలను అందించడం గొప్ప సంప్రదాయమన్నారు. ఉగాది పురస్కారం అందుకున్న అక్షర కిరీటి తెన్నేటి మాస్టార్‌ను ఆర్‌వీ ఎస్ రాజు, చిర్రావూరి లక్ష్మీనారాయణ, లక్ష్మణ్‌కుమార్, యండపల్లి పాండురంగ కవి, పి.మహేష్‌బాబు తదితరులు అభినందించారు.

సీపీఎం తొలితరం నాయకులకు నివాళి



నాయకుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి, భీమవరం : సీపీఎం పార్టీ తొలితరం నాయకులు ఇ.ఎం.ఎస్ నంబుద్రిపాద్, తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి కార్యక్రమం మెంటేవారితోట సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. నాయకుల చిత్రపటాలకు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957లో దేశంలో మొట్ట మొదటిసారిగా ప్రజాస్వామ్యయుతంగా ఓట్ల ద్వారా గెలుపొందిన తొలి ముఖ్యమంత్రి ఇం.ఎస్.నంబుద్రిపాద్ అని అన్నారు. అలాగే ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో మల్లు స్వరాజ్యం నిజాం పాలనను వ్యతిరేకించి శ్రామికులు, కూలీల విముక్తి కోసం తుపాకి పట్టి పోరాడిన యోధురాలని కొనియాడారు. కార్యక్రమంలో జేఎవీ గోపాల్, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, మల్లిపూడి ఆంజనేయులు, ఎస్‌కే వలీ, బీఏఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మల ఆరోపణలు హాస్యాస్పదం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా ఎలా ఆహ్వానించింది ఆధారాలతో చూపించినా ఇంకా గవర్నర్‌కు గౌరవం ఇవ్వలేదంటూ ఎమ్మెల్యే నిమ్మల చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తాతాజీ తన కార్యాలయంలో విలేకరుతో మాట్లాడుతూ తూర్పుకాపులకు ఓబీసీ సర్టిఫికెట్ గురించి మాట్లాడుతున్న రామానాయుడు ఆ ఓబీసీ సర్టిఫికెట్‌ను ఎవరు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి తూర్పుకాపులు ఉత్తరాంధ్రలోనే కాదని ఎక్కడ ఉన్నా ఓబీసీ సర్టిఫికెట్ వర్తించాలనే ఉద్దేశంతో నాడు ప్రత్యేక జీవో జారీచేశారన్నారు. అనంతరం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత 2017లో ఆ జీవోను రద్దు చేశారని గుర్తు చేశారు. మరి నాడు అధికారంలో ఉండగా మాట్లాడలేని రామానాయుడు ఈ రోజు ప్లకార్డులు పట్టుకుని తూర్పుకాపుల ఓబీసీ సర్టిఫికెట్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 2018లో గృహ లబ్ధిదారులకు పత్రాలు ఇచ్చి బ్యాంకుల్లో రుణాలు చేయించి అప్పుల పాలు చేసింది ఎవరని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజీ, బెజ్జవరపు నాగరాజు, పిల్లా శ్రీను, జోగి వడ్డికాసులు, కాపిశెట్టి శ్రీను, జోగాడ ఉమామహేశ్వరరావు, రేలంగి శ్రీను, త్సవటపల్లి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వీరవాసరంలో నినాదాలు చేస్తున్న ఆశ వర్కర్లు

వీరవాసరం : ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21న భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వీరవాసరంలో యూనియన్ అధ్యక్షులు డి.వరలక్ష్మి అధ్యక్షతన యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమోషన్లలో అవకాశం కల్పించాలని, రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భీమవరంలో మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అనేకసార్లు పీహెచ్‌సీల పరిధిలో, మండల స్థాయిలో ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళనను ఉధృతం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం కొద్దిసేపు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బేబీ, నిర్మల, సుబ్బలక్ష్మి, పార్వతి తదితరులు మాట్లాడారు.

శ్రీ ముఖిదారమ్మ ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావి చెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖిదారమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 22వ తేది ఉగాది నుంచి 28 వరకూ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో కమిటీ సభ్యులు అమ్మవారి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 22న ఉగాది నాడు పుట్టింటి వారితో, 23న కమిటీ వారిచే రెండు రోజులు అమ్మవారి జాతర మహోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మండెల రజనీ, సెక్రటరీ కుంపట్ల రాజా, ట్రెజరర్ చెక్కా కృష్ణ, సిహెచ్. గణపతి, కె.నాగేశ్వరరావు, ఆర్.శ్రీరామచంద్రమూర్తి, సీహెచ్ సుబ్రహ్మణ్యం, వి శ్రీనివాసరావు, కాశీ, బాబీ, ఎ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గానికి సత్కారం



డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : స్థానిక డీఎన్నార్ కళాశాల అసోసియేషన్ నూతన పాలకవర్గ సభ్యులను పట్టణంలోని చంద్రిక పంక్షన్ హాల్లో ఆదివారం భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరసింహరాజు మాట్లాడుతూ పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయన్నారు. దంతులూరి నారాయణరాజు ఆశయాలకు అనుగుణంగా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యదర్శి గాదిరాజు బాబు మాట్లాడుతూ వాకర్స్ కోసం ప్రత్యేకంగా గ్రౌండ్స్‌ను ఏర్పాటు చేశామని, కళాశాల యాజమాన్యం తరపున వారికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కొత్త శ్రీరామనారాయణ, కో కన్వీనర్ వోలేటి శ్రీనివాస గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ విజేత కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ఆరోగ్యశ్రీ వర్తించని అనేక మంది రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తూ ఆ కుటుంబాలను ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ విజేత కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం పోడూరు మండలం మట్టపర్రు గ్రామ మాజీ సర్పంచ్ తంగెళ్ల పురుషోత్తం కుమారుడు శంకర శ్రీనివాస్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషోత్తం కుటుంబానికి ఏ అవసరం ఉన్నా పార్టీ తరపున ఆదుకుంటామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, జడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరు పెద్దిరాజు, పార్టీ మండల కన్వీనర్ కలిదిండి గణపతిరాజు, వైస్‌ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, గ్రామ పార్టీ నాయకులు కొల్లాబత్తుల రవిబాబు, కుసుమ శుభాకర్, నేలపాటి రత్నరాజు, పెచ్చెట్టి ముత్యాలు, జుత్తిగ పెద్దిరాజు, వాస్కూరి లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలకు సిద్ధం కావాలని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ కుసుమ కుమారి అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక అధ్వర్యంలో ప్రభుత్వ బీసీ హాస్టల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. హాస్టల్ వార్డెన్ కుసుమ కుమారి, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అరగంట ముందే పరీక్ష హాల్‌కు చేరుకోవాలని, ప్రశ్నపత్రాన్ని క్షణంగా చదివి రాయాలని, అన్ని జాగ్రత్తలు అవసరమని అన్నారు. కార్యక్రమంలో అరసవల్లి ట్రస్ట్ చైర్మన్ అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎండీ సరోజినీ, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కవి కోలాటికి నంది పురస్కారం

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన అంబేడ్కర్ సాహితీ వేదిక అధ్యక్షుడు కోలాటి చినపెద్దిరాజు శోభకృత్ నామ తెలుగు సంవత్సర ఉగాది నంది పురస్కారాన్ని అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని రోటరీక్లబ్ ఆడిటోరియంలో ఫిలాంత్రపిక్ సొసైటీ, రాష్ట్ర భాషాభివృద్ధి మండలి సంయుక్తంగా ఆదివారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి చేతుల మీదుగా నంది పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర భాషాభివృద్ధి మండలి చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడు డా.కత్తిమండ ప్రతాప్, సంస్థ చైర్మన్ అద్దంకి రాజా తదితరులు పెద్దిరాజును సత్కరించి పురస్కారం అందజేశారు.

ఔషధాలపై జీఎస్టీని తొలగించాలి



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి సుబ్రాంన్సు భట్టాచార్య

సాక్షి, భీమవరం : ప్రజలకు అవసరమైన ఔషధాలను ప్రభుత్వాలు అందుబాటులోకి తీసుకురావాలని, ఔషధాలపై వేస్తున్న జీఎస్టీలను తొలగించాలని, కార్మిక వ్యతిరేక విధానాలపై, బహుళజాతి కంపెనీలు అవలంబిస్తున్న చట్ట వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని ఎఫ్ఎమ్ఆర్ఏఐ జాతీయ కార్యదర్శి సుబ్రాంన్సు భట్టాచార్యా పిలుపునిచ్చారు. భీమవరంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటెటివ్స్ యూనియన్ జనరల్ కౌన్సిల్ రెండో రోజు సమావేశాల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. కంపెనీలు మెడికల్ రిప్స్ హక్కులపై నిర్ధాక్షిణ్యంగా దాడులు చేస్తున్నాయన్నారు. చట్ట వ్యతిరేకంగా ఒంటెద్దు పోకడలతో పని విధానాలను ప్రవేశపెడుతున్నాయని, విపరీతమైన పనిభారాన్ని వేస్తున్నాయని అన్నారు. కంపెనీలు కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలలో ముందుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో రిప్స్ యూనియన్ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ యు.వి కృష్ణయ్య, ఎస్ శిరీష్ కుమార్, టి.కోటేశ్వరరావు, తెలంగాణ యూనియన్ కోశాధికారి దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులు, ఉద్యోగుల నూతన కార్యవర్గం



కర్రి నాగేశ్వరరావు, అధ్యక్షుడు



దనాల వెంకటరావు, కార్యదర్శి

సాక్షి, భీమవరం : జిల్లాలో ఆరు మున్సిపల్ పట్టణాల్లో పనిచేస్తున్న కార్మికులను, ఉద్యోగులను ఐక్యం చేసి సమస్యలపై రానున్న కాలంలో విస్తృతంగా పోరాటం నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజా రామ్మోహన్‌రాయ్ అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కర్రి నాగేశ్వరరావు, ధనాల వెంకటరావుతోపాటు దానయ్య, నీలాపు రాజు, ఆదినారాయణ బాబు మరో 13 మందితో నూతన కార్యవర్గం ఏర్పాటైంది.

దళితవాడలపై శ్రద్ధ చూపాలి

ఉండి : దళితవాడలపై అధికారులు శ్రద్ధ చూపించాలని మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉండి మండలం వెలివర్రు ఎస్సీ కాలనీలో శని, ఆదివారాల్లో కురిసిన కొద్దిపాటి వర్షానికి సీసీ రోడ్డుపై నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి స్థానికంగా డ్రెయిన్‌ల మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

కాళ్ల : ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వ్యవసాయ కార్మికులు, రైతులు కార్మికులు, పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. రైతు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాళ్ల శివాలయంలో మండా సూరిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చి రైతులకు ద్రోహం చేసే చర్యలను రైతులు వీరోచిత పోరాటంతో అడ్డుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు రజిని, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘం జిల్లా సెక్రెటరీ గంటా భవాని, ఏడుకొండలు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టబోతుల మధు, పసుపులేటి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో చెల్లిస్తేనే వడ్డీ రాయితీ

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిదారులు ఈ నెలాఖరులోపుగా కడితే వడ్డీ పూర్తి రాయితీ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి బకాయిలు చెల్లించిన వారికి ఇది వర్తిస్తుందని చెప్పారు. పన్ను బకాయిలు మీ సేవ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు, సచివాలయాల్లో చెల్లించవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణ వాసులకు సూచించారు.

నేడు స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30గంటలనుంచి ప్రజ ల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరి స్తారని ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వర్గాలు తెలిపాయి. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటార, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.